సాక్షి
మంచిర్యాల

ఆదివారం । 26 । జనవరి । 2025

- మహిళా శక్తితో ముందడుగు
- సాగులో 'సేంద్రియ' బాట
- మాతృభూమి సేవలో ప్రణమిల్లుతున్న పల్లెలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రగతి బాట పడుతోంది. రాజ్యాంగ స్ఫూర్తితో ముందడుగు వేస్తోంది. అవకాశాలను అందిపుచ్చుకుంటూ అభివృద్ధి రాగం వినిపిస్తోంది. దేశసేవలోనూ తరిస్తోంది. ఇందులో పల్లె, పట్టణం భాగస్వామ్యం అవుతున్నాయి. స్వశక్తితో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తుండగా.. యువత మాతృభూమి రక్షణకు సై అంటోంది. ఆరోగ్య సేద్యంతో అన్నదాత 'ప్రకృతి' ఒడిలో సేదతీరుతున్నాడు. అవనిని మువ్వన్నెలు ముద్దాడుతున్నాయి. నేడు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

రాజ్యాంగ స్ఫూర్తి.. ప్రగతి బాట



మరిన్ని వివరాలు 8లో ▸

రెపరెపలాడుతున్న జాతీయ జెండా

ఆదిలాబాద్: భారత ఖ్యాతి నలువైపులా విస్తరిస్తుంది అన్నట్లు ఈ భారీ త్రివర్ణ పతాకం రెపరెపలాడుతోంది. పట్టణం నడిబొడ్డున 150 అడుగుల మూడు రంగుల జెండా సగర్వంగా నిలబడి ప్రతి

నింగినంటిన మువ్వన్నెలు

ఒక్కరి హృదయాన్ని తనవైపు ఆకర్షిస్తోంది. దేశభక్తిని గుండెల నిండా నింపుకొన్న స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాన్ని, స్ఫూర్తిని చాటుతూ జిల్లా ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం నిలుపుకొంటోంది. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద ఉన్న ఈ భారీ పతాకాన్ని స్థానిక ఎన్టీటీ బిజినెస్ డేటా సొల్యూషన్స్ ఐటీ కంపెనీ ఏర్పాటు చేసింది. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా రూ.27 లక్షల వ్యయంతో 2023లో ఏర్పాటు చేయగా అప్పటి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఆగస్టు 15న ఆవిష్కరించారు. పట్టణవాసులు, విద్యార్థులు, జిల్లాకు వచ్చే పర్యాటకులు ఈ భారీ జెండా వద్ద సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ జాతీయ భావం చాటుతున్నారు.

నిత్య జనగణమన



జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే వినోద్, ప్రజలు(ఫైల్)

బెల్లంపల్లి: ప్రజల్లో జాతీయ భావాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో బెల్లంపల్లిలో జనహిత సేవా సమితి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన నిత్య జనగణమన గీతాలాపన నేటితో సరిగ్గా ఏడాది పూర్తి చేసుకుంది. 2024 జనవరి 26న ఎమ్మెల్యే గడ్డం వినోద్ ద్వారా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రోజు ఉదయం 8గంటల ప్రాంతంలో జనగణమన గీతాలాపన నిర్విఘ్నంగా సాగుతోంది. పాత బస్టాండ్ చౌరస్తా, బజారు ఏరియా, అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన మైక్‌ల ద్వారా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి జాతీయ గీతాన్ని ప్రారంభించగానే రోడ్డుపై వెళ్తున్న అన్ని వర్గాల ప్రజలు ఒక్కసారిగా నిలబడి గీతాలాపన పూర్తయ్యేదాకా మువ్వన్నెల జెండాకు సెల్యూట్ చేస్తూ జాతీయ భావాన్ని చాటుతున్నారు. కూరగాయల వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, విద్యార్థులు, రోజువారీ కూలీలు, షాపుల యజమానులు, ఆర్టీసీ డ్రైవర్లు, వాహనదారులు ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతున్నారు. కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు, ప్రభుత్వ శాఖల అధికారులు సంపూర్ణ సహకారం ఇస్తుండటంతో నిరాటంకంగా కొనసాగుతోంది. జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీశ్ పట్టుదలతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

పచ్చళ్లతో ఉపాధి



చేప పచ్చడి తయారు చేస్తున్న మహిళలు

కడెం: కడెం మండల కేంద్రానికి చెందిన 50 మంది మహిళలు గతేడాది ఫిబ్రవరిలో ఈడీఐఐ యాక్సెంచర్ ద్వారా 26 రోజులపాటు చేప, రొయ్యల పచ్చడి తయారీపై శిక్షణ పొందారు. 30 మంది పచ్చళ్ల తయారీని ప్రారంభించారు. ఇందిర మహిళా శక్తి పథకం, ఈడీఐఐ యాక్సెంచర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సీఎఫ్‌సీ సెంటర్‌ను ప్రారంభించారు. చేపలు, రొయ్యలు, చికెన్ పచ్చళ్లు తయారు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. చేపల పచ్చడి రూ.800కు కేజీ, రొయ్యల పచ్చడి కేజీ రూ.2 వేలకు విక్రయిస్తున్నారు. స్థానికంగా దొరికే ఎండు రొయ్యలు, ఎండుచేపలను విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. ఇప్పటివరకు 200 కిలోల వరకు చేపల పచ్చళ్లు విక్రయించారు.

నాణ్యమైన పచ్చళ్లు



పచ్చళ్ల తయారీలో నాణ్యత, ప్రమాణాలు పాటిస్తున్నాం. కడెం ప్రాజెక్ట్‌లో దొరికే తాజా చేపలు, రొయ్యలతో పచ్చళ్లు తయారు చేస్తున్నాం. మా సీఎఫ్‌సీ సెంటర్‌లో పచ్చళ్లతో పాటుగా ఎండు చేపలు, రొయ్యలు లభిస్తాయి. – మామిడాల పద్మ, కడెం



రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో మహిళా శక్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్యాంటీన్

సంఘంలో చేరి... స్వయం శక్తిగా ఎదిగి

కైలాస్‌నగర్: జిల్లాలోని తలమడుగు మండలం కజ్జర్ల గ్రామానికి చెందిన గంగోత్రి గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు కొప్పుల సరోజ తొలుత వ్యవసాయ కూలీ. చేను పనులు చేస్తూనే స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా చేరారు. తనలాంటి మరో తొమ్మిది మందిని అందులో చేర్పించారు. వారితో కలిసి పొదుపు ప్రారంభించారు. బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి రుణాలు అందుకున్న వారంతా వాటిని సద్వినియోగం చేసుకున్నారు. తొలుత ఏదైనా వ్యాపారం చేపట్టాలని భావించారు. ఈ క్రమంలో కొద్ది రోజుల పాటు మావల మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చిన్న హోటల్ నిర్వహించారు. డీఆర్డీఏ పరిధిలో నిర్వహించే సమావేశాలకు భోజనం సరఫరా చేస్తూ అధికారుల దృష్టిని ఆకర్షించారు.

అవకాశం అందిపుచ్చుకుని..

హోటల్ రంగంలో రాణిస్తున్న సరోజను గమనించిన డీఆర్డీఏ అధికారులు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌ను వారి సంఘానికి మంజూరు చేశారు. ఇందుకోసం రూ.5లక్షల బ్యాంక్ రుణం కూడా మంజూరు చేశారు. వీటితో ఆమె జిల్లా కేంద్రంలోని రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో క్యాంటీన్ షురూ చేశారు. ఐదు నెలలుగా విజయవంతంగా నిర్వహిస్తున్నారు. రుచి, శుచితో కూడిన అన్ని రకాల ఆహార పదార్థాలను ఇందులో విక్రయిస్తుండడంతో రోగుల సహాయకులు, వైద్యులు క్యూ కడతున్నారు. గిరాకీ పెరుగుతోంది. ప్రతి నెలా క్రమం తప్పకుండా ఈఎంఐ చెల్లిస్తున్నారు. తనతో పాటు మరో ఇద్దరికి ఉపాధి కల్పిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు సరోజ.

అధికారుల ప్రోత్సాహంతో..



అధికారుల ప్రోత్సాహంతో ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌ను ఇక్కడ ఐదు నెలల క్రితం ప్రారంభించాం. నాతో పాటు మరో ఇద్దరికి ఉపాధి కల్పిస్తున్నా. పేషెంట్లకు ప్రభుత్వపరంగా అందించే భోజన టెండర్లను అప్పగిస్తే మరికొంత మందికి ఉపాధితో పాటు ఆర్థికంగా లబ్ధి చేకూరే అవకాశముంటుంది. విషయాన్ని ఇటీవల మంత్రి సీతక్కకు కూడా విన్నవించాం. వారు కూడా సానుకూలంగా స్పందించారు.
– కొప్పుల సరోజ, క్యాంటీన్ నిర్వాహకురాలు

విస్తరాకుల పరిశ్రమతో విజయం





మిషన్‌పై మోదుగు ఆకులను కట్ చేస్తున్న శ్రీలత

భీమారం: మండల కేంద్రంలోని మాదన్న గూడేనికి చెందిన ఆదివాసీ మహిళ శ్రీలత మోదుగు ఆకులతో విస్తరాకుల తయారీ కేంద్రం నిర్వహిస్తూ సక్సెస్ బాటలో పయనిస్తోంది. శ్రీరామ స్వయం సహాయక సంఘంలో సభ్యురాలైన ఈమె 2018లో రూ.2లక్షలు రుణం తీసుకుని విస్తరాకుల పరిశ్రమను నెలకొల్పింది. శ్రీలత తన తోటి మహిళలతో సమీప అడవికి వెళ్లి మోదుకు ఆకులను సేకరించి తెస్తోంది. స్వతహాగా విస్తరాకుల ను తయారు చేసి తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రకు కూడా సరఫరా చేస్తోంది. ప్లాస్టిక్ రహితం కోసం కృషి చేస్తోంది. గుడిసెలో నివసించే తాను స్వయం సహాయక సంఘం ద్వారా రుణం పొంది వ్యాపారంలో రాణించానని, ప్రస్తుతం ఇల్లు నిర్మించుకోవడమే కాకుండా ఇతర మహిళలకూ ఉపాధి కల్పిస్తున్నట్లు చెబుతోంది.

పెరటి కోళ్ల పెంపకంలో రాజమ్మ..



పెరటి కోళ్లఫాం వద్ద రాజమ్మ

జైపూర్: చదువు లేకున్నా సొంత తెలివితో పెరటి కోళ్ల పెంపకం చేపడుతూ మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన ఎగుడ రాజమ్మ ఆర్థికంగా రాణిస్తోంది. ఇంటి సమీపంలోనే ఉపాధిహామీ కింద షెడ్డు నిర్మించుకుని బ్యాచ్‌కు 1,500 కోడి పిల్లలను పెంచి కిలో, రెండు కిలోలు కాగానే స్థానిక వ్యాపారులకు విక్రయిస్తోంది. ఖర్చులు పోను నెలకు రూ.50వేలకు పైగా సంపాదిస్తోంది. మరోవైపు కులవృత్తిని కూడా కొనసాగిస్తోంది. కుండలు తయారు చేస్తూ జీవనం సాగిస్తోంది. భవిష్యత్‌లో పెరటి కోళ్ల పెంపకాన్ని మరింత అభివృద్ధి చేయనున్నట్లు చెబుతోంది.

ఆదర్శంగా సరస్వతీ సమాఖ్య



సమావేశంలో పాల్గొన్న మహిళలు

భైంసా: డివిజన్‌లోని ముధోల్ మండల సరస్వతీ సమాఖ్య ఆదర్శంగా నిలుస్తోంది. 2004లో ఏర్పాటైన ఈ సమాఖ్యలో 25 గ్రామైక్యసంఘాలు, 794 స్వయం సహాయక సంఘాలున్నాయి. 8,636 మంది సభ్యులు ఉన్నారు. ఏటా మహిళలకు రుణాలు ఇచ్చి రికవరీ చేయిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. 2,133 మంది సభ్యులకు రూ.14కోట్ల 45లక్షల 3,642 రుణం తీసుకున్నారు. స్త్రీనిధి ద్వారా రూ.36,49,200 పొదుపు చేశారు. జిల్లాలోనే ఈ సంఘం పొదుపులో ఆదర్శంగా నిలిచింది.

రుణాలు ఇస్తూ.. కిస్తీలు చెల్లిస్తూ...

ఈ సమాఖ్య పరిధిలోని గ్రామైక్య సంఘాలు సమావేశాలు నిర్వహించి అందులో ఉన్న స్వయం సహాయక సంఘాల మహిళలకు కావాల్సిన చిన్నచిన్న పరిశ్రమలకు రుణాలు ఇస్తున్నారు. పూర్తిస్థాయిలో చెల్లింపులు ఉండడంతో యేటా రూ.9 నుంచి రూ.10 కోట్ల వరకు బ్యాంకు లింకేజీ రుణాలు ఇస్తున్నారు. చెల్లింపులో వెనుకబడకుండా జిల్లాలోనే ఈ సమాఖ్య ఆదర్శంగా నిలుస్తుంది.

వరుసగా మూడేళ్లు...

- 2015–16 ఆర్థిక సంవత్సరంలో స్త్రీనిధిలో 587 మంది సభ్యులకు రూ.3 కోట్ల 21 లక్షల 73,881 రుణం ఇచ్చారు. వందశాతం రికవరీతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ సంఘం అవార్డు అందుకుంది. అప్పటి ప్రభుత్వం ఈ సంఘానికి మహిళ దినోత్సవం సందర్భంగా ఉత్తమ పురస్కారం అందించారు.
- 2016–17 ఆర్థిక సంవత్సరంలో 508 మంది సభ్యులకు రూ. 3 కోట్ల 51 లక్షల 21,368 రుణం ఇచ్చి వందశాతం రికవరీచేశారు. నిర్మల్ జిల్లాలో మొదటిస్థానంలో నిలిచిన ఈ సంఘానికి ఉత్తమ అవార్డు అందించారు.
- 2017–18 ఆర్థిక సంవత్సరంలో 589 మంది సభ్యులకు రూ.4 కోట్ల 23 లక్షల 25,426 రుణాలు ఇచ్చారు. వందశాతం రికవరీతో వరుసగా మూడవసారి ఉత్తమ అవార్డు దక్కింది.

సద్వినియోగం చేసుకుంటున్నాం



సరస్వతీ సమాఖ్య పరిధిలోని గ్రామైక్య సంఘాలకు సమావేశాలు నిర్వహిస్తాం. గ్రామాల్లో ఉపాధి కోసం కావాల్సిన రుణాలను అందిస్తున్నాం. పిండిగిర్నీ, కిరాణ దుకాణం, హార్డ్‌వేర్‌షాపులు ఏర్పాటు చేసుకున్నారు. రుణాల కిస్తీలు చెల్లిస్తున్నారు. సమష్టి కృషితోనే రుణ రికవరీ జరుగుతోంది.
– దమ్మ జ్యోతి, సరస్వతీ సమాఖ్య అధ్యక్షురాలు

తేనె శుద్ధితో లాభాలు



వాంకిడిలోని తేనెశుద్ధి కేంద్రం

వాంకిడి(ఆసిఫాబాద్): వాంకిడి మండలంలోని స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి 2022లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తేనె శుద్ధి యంత్రాలు అందించారు. మండల సమాఖ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కర్మాగారాన్ని ఏర్పాటు చేసుకుని మహిళలు లాభాలు గడిస్తున్నారు. మండలం సమాఖ్యలో మొత్తం 32 వీవో సంఘాలు ఉన్నాయి. ప్రారంభంలో మార్కెటింగ్‌పై అవగాహన లేక తడబడి 2023లో తేనె శుద్ధిని నిలిపివేశారు. ఆ తర్వాత తేనె సేకరణ, మార్కెటింగ్‌పై దృష్టి సారించారు. గత నష్టాలను అధిగమించి ఇప్పటివరకు రూ.30 వేల వరకు లాభాలు రాబట్టినట్లు ఐకేపీ సిబ్బంది వెల్లడించారు. ప్రస్తుతం చెట్లపై సహజంగా లభించే తేనె కొనుగోలు చేసి శుద్ధి చేస్తున్నారు. 'నేచర్ హనీ' బ్రాండ్ పేరుతో విక్రయిస్తున్నారు. కల్తీ లేకుండా నాణ్యతతో ఉండటంతో మండలానికి వచ్చే ఉన్నతాధికారులు, వివిధ గ్రామాల ప్రజలు తేనె కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు.

విభిన్న పద్ధతుల్లో సాగు



కొడుకుతో కలిసి ఎరువు చల్లుతున్న సుగుణ

దండేపల్లి: ఇటీవలి కాలంలో చాలామంది రైతులు వరి, పత్తి, మొక్క జొన్న మాత్రమే సాగు చేస్తున్నారు. మండలంలోని నాగసముద్రం గ్రామానికి చెందిన నందుర్క సుగుణ–నారాయణ దంపతులు అమెరికాలో ఉండే పెద్దకొడుకు మురళి ప్రోత్సాహం, మరో ఇద్దరు కుమారులు ప్రశాంత్, పవన్ సహకారంతో సాగులో విభిన్న పద్ధతులు పాటిస్తున్నారు. వివిధ రకాల పంటలు పండిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. 2016 నుంచి వీరు పంటసాగులో నూతన పద్ధతులు పాటిస్తున్నారు. వరిలో సాధారణ రకాలను పక్కన పెట్టి దేశవాళీ వంగడాలైన నల్లవరి, తెల్లవరి, మొక్కజొన్న, నువ్వులు, పెసలు సాగు చేస్తున్నారు. వీటన్నింటికీ సేంద్రియ ఎరువులే వినియోగిస్తారు. పంటలు పండించడంతో పాటు వ్యవసాయ అనుబంధంగా పొలం వద్ద చేపల చెరువు ఏర్పాటు చేసి అందులో చేపలూ పెంచుతున్నారు.

'ఆరోగ్య' సేద్యం



ఆదిలాబాద్ నాచురల్స్‌లో ఉంచిన కూరగాయలు

గుడిహత్నూర్: రసాయన ఎరువుల సాగుతో నష్టాలను చవిచూసిన మండలంలోని తోషం గ్రామానికి చెందిన ఆదర్శ రైతు పస్తాపురే రవీందర్ ఎనిమిదేళ్లుగా సేంద్రియ బాట పట్టాడు. తనకున్న మూడెకరాల్లో ప్రకృతి సేద్యం ద్వారా కూరగాయలు పండిస్తూ తనతో పాటు వినియోగదారులకు ఆరోగ్యం పంచుతున్నాడు.

కష్టాలను అధిగమించి..

గతంలో సేంద్రియ కూరగాయలు మార్కెట్‌కు తీసుకెళితే ధర మామూలు వాటికి పలికిన విధంగానే ఉండేది. దిగుబడి తక్కువ, శ్రమ ఎక్కువ కావడంతో కొంత నిరాశ చెందాడు. అయితే సంకల్పం మాత్రం వీడలేదు. తనతో పాటు మరికొందరికి ఈ సేద్యంపై అవగాహన కల్పించాడు. వారందరినీ లాభాల బాట పట్టేలా ఏకతాటిపై తీసుకువచ్చాడు.

కలెక్టర్ చొరవ.. ప్రకృతి ఫుడ్స్ ఆవిర్భావం

జిల్లాలోని సేంద్రియ రైతులంతా ఏకమై గతంలో పనిచేసిన కలెక్టర్ దివ్యా దేవరాజన్‌ను కలిసి తమ సమస్యను విన్నవించారు. ఈ క్రమంలో ఆమె సేంద్రియ ఉత్పత్తుల ఆవశ్యకతను గుర్తించారు. ఐదేళ్ల క్రితం జిల్లా కేంద్రం నడిబొడ్డున కలెక్టరేట్ చౌక్ వద్ద ప్రత్యేక స్థలం కేటాయించారు. సేంద్రియ ఉత్పత్తులు విక్రయించేందుకు అవసరమైన ఏర్పాట్ల కోసం రూ.29 లక్షలు మంజూరు చేశారు. దీంతో వీరు 'ప్రకృతి ఫుడ్స్' పేరిట సహకార సంఘంగా మారారు. తమ ఉత్పత్తులను 'ఆదిలాబాద్ నాచురల్స్' స్టోర్‌లో విక్రయిస్తూ మంచి ఆదాయం పొందుతున్నారు. ఇక్కడ రైతులు సాగు చేసిన సేంద్రియ ఉత్పత్తులను నేరుగా వినియోగదారుడికి విక్రయించే వెసులుబాటు ఉంది. దీంతో దళారుల ప్రమేయం లేకుండా వారికి గిట్టుబాటు ధర దక్కుతోంది.

అవగాహన కల్పిస్తున్నాం..



సేంద్రియ సాగు ఆవశ్యకతపై జిల్లాలోని ఇతర రైతులకు కూడా అవగాహన కల్పిస్తున్నాం. సాగు విస్తీర్ణం పెంచేందుకు మా వంతు కృషి చేస్తున్నాం. భావి తరాలకు ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ప్రజలు సైతం సేంద్రియ ఉత్పత్తులను ఆదరిస్తున్నారు.
– పస్తాపురే రవీందర్, ప్రకృతి ఫుడ్స్ చైర్మన్, సేంద్రియ రైతు

బల్దియాల్లో 'ప్రత్యేక' పాలన

- ముగిసిన పాలకవర్గాల పదవీకాలం
- త్వరలో స్పెషల్ ఆఫీసర్ల నియామకం
- ఆరు చోట్ల గెజిటెడ్ అధికారులకు..
- మంచిర్యాలకు ఐఏఎస్ స్థాయి ఆఫీసర్!
- ఐదేళ్లలో పట్టణాలాభివృద్ధి అంతంతే..



మంచిర్యాల మున్సిపాలిటీ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పుర'పాలక వర్గాల' పదవీ కాలం నేటితో ముగిసింది. చైర్మన్, కౌన్సిలర్ల స్థానంలో ప్రత్యేకాధికారుల పాలన మొదలుకానుంది. మంచిర్యాల కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అవుతున్న నేపథ్యంలో ఐఏఎస్ స్థాయి అధికారిని ప్రత్యేకాధికారిగా నియమించే అవకాశముంది. మిగతా చోట్ల గెజిటెడ్ ఆఫీసర్లు ప్రత్యేకాధికారులుగా వ్యవహరించనున్నారు. జిల్లాలో ఏడు మున్సిపాలిటీలు న్నాయి. వీటిలో మంచిర్యాల, లక్సెట్టిపేట, నస్పూర్, చెన్నూరు, క్యాతనపల్లి, బెల్లంపల్లి మున్సిపాలిటీలకు పాలకవర్గాలున్నాయి. మందమర్రికి ఏజెన్సీ వివాదంతో ఎన్నికలు నిర్వహించడం లేదు. ఆరు పురపాలికలకు 2020 జనవరి 22న ఎన్నికలు నిర్వహించగా 25న ఫలితాలు విడుదలయ్యాయి. అదే నెల 27న కొత్త పాలకవర్గాలు కొలువుదీరాయి. అప్పటి అధికార టీఆర్‌ఎస్ పార్టీ ఆరు మున్సిపాలిటీల పీఠాలను కైవసం చేసుకుంది. ఎన్నికలు జరిగిన 150వార్డుల్లో వంద వార్డులు గెలుచుకుంది. చివరి ఏడాదిలో అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అవిశ్వాస తీర్మానాలతో మున్సిపాలిటీల్లో రాజకీయ ముసలం ఏర్పడింది. మంచిర్యాల, క్యాతనపల్లి, నస్పూర్‌లో కొత్త పాలకవర్గాలు కొలువుదీరాయి. లక్సెట్టిపేట, బెల్లంపల్లి, చెన్నూరులోనూ కౌన్సిలర్లు, చైర్‌పర్సన్ల పార్టీల మార్పులతో రాజకీయంగా మార్పులు వచ్చాయి.

ఆశించిన అభివృద్ధి జరగలే..

గత ఐదేళ్లలో మున్సిపాలిటీల్లో ఆశించిన అభివృద్ధి జరగలేదు. ఇప్పటికీ మౌలిక వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు. కొత్తగా ఏర్పాటైన చెన్నూరు, క్యాతనపల్లి, లక్సెట్టిపేటలో ఇంకా సరైన వసతులు కల్పించలేదు. పట్టణవాసులకు ఇంటింటికీ శుద్ధజలం అందడంలేదు. మురుగుకాలువలు, అంతర్గత రోడ్లు పూర్తి స్థాయిలో లేవు. 'పుర'సేవల్లోనూ జాప్యం జరుగుతోంది. మాస్టర్‌ప్లాన్ పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదు. సింగరేణి ప్రభావిత ప్రాంతాలైన నస్పూర్, క్యాతనపల్లి, బెల్లంపల్లి పట్టణాల్లో కంపెనీతో గాని పాలకవర్గాలతో గాని ఎలాంటి అభివృద్ధి జరగలేదు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తున్నా ఆచరణలో సాధ్యం కావడం లేదు. డంప్‌యార్డులు, శ్మశాన వాటికలు, ఓపెన్‌జిమ్‌లు, భవనాలు, సీసీ రోడ్లు, వైద్యారోగ్య కేంద్రాలు, చెరువుల సుందరీకరణ తదితర పనులు మొదలయ్యాయి. కొన్నిచోట్ల పనులు పూర్తికాగా, చాలాచోట్ల మధ్యలోనే నిలిచాయి. ఇక పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు జరగక వారు ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. నిధుల కొరతకు తోడు పాలకవర్గాల్లో చిత్తశుద్ధిలోపాలతోనూ ఇంకా పరిస్థితులు మెరుగుపడలేదు.

పనులు అసంపూర్తిగా..

జిల్లా కేంద్రంలో ఐదేళ్లలో రూ.75కోట్ల అభివృద్ధి పనులు మొదలు కాగా, ఇందులో రూ. 55 కోట్లు ఖర్చు చేసి పనులు చేపట్టారు. మందమర్రిలో రూ.183 కోట్లు ఖర్చు చేయగా, మరో రూ.26 కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. నస్పూర్‌కు రూ.43.24 కోట్లు రాగా, రూ. 35.87 కోట్లు ఖర్చు చేశారు. రూ.7.37 కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. బెల్లంపల్లిలో రూ.12.54కోట్ల పనులు పూర్తవగా, రూ.కోటి విలువైన పనులు పురోగతిలో ఉన్నాయి. మొత్తం 252 అభివృద్ధి పనుల్లో 194 పనులు పూర్తయ్యాయి. రెండు పనులు పురోగతిలో ఉండగా, ఇంకా 29 పనులు మొదలు కావాల్సి ఉంది. చెన్నూరుకు రూ.146.44 కోట్లు మంజూరు కాగా, రూ.79.81కోట్ల అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. రూ.66.33 కోట్ల పనులు పురోగతిలో ఉన్నాయి. లక్సెట్టిపేటలో రూ.10కోట్ల అభివృద్ధి పనులు జరిగాయి. క్యాతనపల్లిలో రూ.143కోట్ల పనులు మొదలు కాగా, రూ.22 కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

మందమర్రిలో విచిత్ర పరిస్థితి

ఆరు మున్సిపాలిటీలతో పోలిస్తే మందమర్రి పట్టణ పరిస్థితి భిన్నంగా ఉంటోంది. ఇక్కడ ఏజెన్సీ వివాదంతో ఎన్నికలు నిలిచిపోయాయి. అధికారులే అన్నీ తామై వ్యవహరిస్తున్నారు. దీంతో అభివృద్ధికి ఆటంకమేర్పడుతోంది. ఈ సారైనా ఎన్నికలు నిర్వహించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని పట్టణవాసులు కోరుతున్నారు.

గణతంత్ర వేడుకలకు సిద్ధం



ముస్తాబైన జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానం

- ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర హైస్కూల్ మైదానంలో ఆదివారం గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రజాప్రతినిధులు, అధికారులు, పురప్రముఖులు, సీనియర్ సిటిజన్లకు సీటింగ్ అరేంజ్‌మెంట్ చేశారు. అన్ని సౌకర్యాలు కల్పించారు. వివిధ శాఖల స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించనున్నారు. ఆటల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు.

వేడుకల్లో కార్యక్రమాలు ఇలా ..

ఉదయం 9గంటలకు కలెక్టర్ కుమార్‌దీపక్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండా ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తారు. 9.15నుంచి 9.30గంటల వరకు జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రసంగించనున్నారు. 9.30 నుంచి 10.30 గంటల వరకు బాలబాలికల సాంస్కృతిక కార్యక్రమాలు, 10.30నుంచి 10.45 గంటల వరకు శకటాల ప్రదర్శన ఉంటుంది. 10.45నుంచి 11.30 గంటల వరకు ఉత్తమ సేవలందించిన ఉద్యోగులు, వివిధ రంగాల్లో రాణించిన, సేవా కార్యక్రమాలు చేపట్టిన వారికి ప్రశంసాపత్రాలను ప్రదానం చేస్తారు. 11.30నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసేలా స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు. సాయంత్రం 4గంటలకు కలెక్టరేట్ ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు, యువత, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ప్రజలు అధికసంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

క్లుప్తంగా

చోరీ కేసులో నిందితుడి రిమాండ్



అరెస్టు చూపెడుతున్న ఎస్సై ఆంజనేయులు

కాసిపేట: మండలంలోని ధర్మరావుపేటకు చెందిన గోపు శంకరమ్మ ఇంట్లో బంగారం చోరీ చేసిన కేసులో మేకల శశికుమార్‌ను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు తెలిపారు. 15 గ్రాముల నెక్లెస్, 5 గ్రాముల ఉంగారం, 20 గ్రాముల ముద్ద బంగారం చోరీ జరిగిందని, అందులోంచి నెక్లెస్ ప్రైవేట్ సంస్థలో తాకట్టు పెట్టి రూ.19వేలు తీసుకున్నట్లు ఒప్పుకున్నాడన్నారు. బంగారం రికవరీ చేసుకుని నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎంపికైన గ్రామాల్లో లబ్ధిదారులకు పథకాలు



వీసీలో పాల్గొన్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 26న గ్రామాల్లో లబ్ధిదారులకు పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని అంబేడ్కర్ సచివాలయం నుంచి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. లాంఛనంగా ప్రారంభించనున్న పథకాలను లబ్ధిదారులకు అందించేందుకు మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. రేషన్ కార్డులు, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల ను అర్హులకు అందజేసేందుకు మండలానికి గాను ఒక గ్రామం చొప్పున ఎంపిక చేయాలని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి అర్హులకు పథకాల మంజూరు పత్రాలు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నా రు. ఈ కార్యక్రమంలో డీసీపీ ఏ.భాస్కర్ జిల్లా అదనపు కలెక్టర్ మోతి లాల్ పాల్గొన్నారు.

ప్రాణం తీసిన రాంగ్‌రూట్

ఆసిఫాబాద్అర్బన్: గమ్య స్థానాన్ని త్వరగా చేరుకోవాలనే ఆత్రుతతో రాంగ్‌రూట్‌లో ప్రయాణించిన ద్విచక్ర వాహనదారుడు ప్రాణాలు పోగొట్టుకొన్నాడు. సీఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం కాగజ్‌నగర్ మండలం వంజిరి నందిగూడకు చెందిన గుర్లె మొండయ్య శనివారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై వంజిరి గ్రామానికి చెందిన మంతెన ప్రభాకర్‌తో కలిసి రాంగ్ రూట్‌లో వెళ్తుండగా జిల్లా కేంద్రంలోని ఫారెస్టు చెక్‌పోస్టు సమీపంలో కారు ఢీకొట్టింది. మొండయ్యకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రభాకర్‌కు తీవ్రగాయాలు కావడంతో ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఒకే కుటుంబం నుంచి ఏడుగురు..

బోథ్ మండల కేంద్రానికి చెందిన కదం భోజారాం, ముకుంద్, శంకర్, నర్సింగ్‌రావు సోదరులు. భోజారాం రెండో కుమారుడు ప్రవీణ్ కుమార్, మూడో కుమారుడు ప్రతాప్ సైనికులుగా విధులు నిర్వహిస్తున్నారు. ముకుంద్ పెద్ద కుమారుడు సుధాకర్ సైనికునిగా సేవలు అందించి రిటైర్డ్ అయ్యారు. రెండో కుమారుడు కదం మధుకర్, శంకర్ కుమారుడు ప్రశాంత్, నర్సింగ్ రావు కుమారుడు విజయ్ ప్రస్తుతం సైనికులుగా విధులు నిర్వహిస్తున్నారు. ఒకే కుటుంబం నుండి ఏడుగురు జవాన్లుగా దేశ రక్షణ కోసం పాటుపడుతున్నారు.

వీరమరణం పొందిన సతీశ్‌గౌడ్



సతీశ్‌గౌడ్ (ఫైల్)

బోథ్ మండలంలోని మర్లపెల్లికి చెందిన గొడిసెల లింగాగౌడ్ కుమారుడు సతీశ్‌గౌడ్ సీఆర్‌పీఎఫ్ జవానుగా విధులు నిర్వహించాడు. 2016లో గడ్చిరోలి, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టులకు, సీఆర్‌పీఎఫ్ బలగాలకు మధ్య జరిగిన కాల్పుల్లో సతీశ్‌గౌడ్ మృతి చెందాడు. అతని జ్ఞాపకార్థం స్వస్థలం మర్లపెల్లిలో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం సతీశ్ వర్ధంతిని గ్రామస్తులు ఘనంగా నిర్వహిస్తారు.

దేశసేవ చేయడం గర్వంగా ఉంది



2008లో సీఆర్‌పీఎఫ్‌లో సెలెక్ట్ అయ్యా. 18 ఏళ్ల పాటు ఆర్మీలో విధులు నిర్వర్తించా. మరో రెండేళ్లలో రిటైర్డ్ కాబోతున్నా. దేశానికి సేవచేసే అవకాశం రావడం గర్వంగా భావిస్తున్నా. దేశ రక్షణలో విధులు నిర్వహించడం సంతోషంగా ఉంది.

– జడాల శంకర్, సైనికుడు, బోథ్

జననీ జన్మభూమిశ్చ..

- దేశ రక్షణలో ఉమ్మడి జిల్లా యువత
- సైనికులుగా సరిహద్దుల్లో విధులు..
- మాతృభూమి రుణం తీర్చుకుంటున్న ఆర్మీ జవాన్లు



తల్లి, పుట్టిన ఊరు, పుట్టిన దేశం స్వర్గం కన్నా గొప్పవి. సొంత ఊరిలో మనం హాయిగా స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామంటే కారణం.. సరిహద్దుల్లో భరత మాత రక్షణకు తమ ప్రాణాలు పణంగా పెట్టి గస్తీ కాస్తున్న సైనికులే కారణం. తమ కుటుంబాలను వదిలి దేశ ప్రజల కోసం యుద్ధభూమిలో ఉంటున్నారు. ఎటు నుంచి ఏ ముప్పు వాటిల్లుతుందో తెలియని పరిస్థితుల్లో దేశాన్ని కాపాడుతున్నారు. యుద్ధభూమిలో ఉంటూ దేశసేవ చేయడానికి ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం నుంచే 300లకు పైగా జవాన్లు సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్నారు. మాతృభూమి రుణం తీర్చుకుంటున్నారు. రానున్న రోజుల్లో అకాడమీ ఏర్పాటు చేయడానికి పలువురు సైనికులు సన్నాహాలు చేస్తున్నారు. స్థానిక యువతకు సైనికులు ఆదర్శంగా నిలుస్తున్నారు. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సైనిక పల్లెలపై ప్రత్యేక కథనం.

– బోథ్/ఇచ్చోడ

యువత ముందుకు రావాలి



చెన్నూర్: దేశరక్షణలో నావంతు భాగస్వామ్యం ఉండాలని చిన్ననాటి నుంచి కలలు కన్నా. ఆర్మీకి ఎంపికయ్యా. ఐదేళ్లుగా ఆర్మీ జవాన్‌గా పనిచేస్తున్నా. ప్రస్తుతం జమ్మూకశ్మీర్‌లో విధులు నిర్వర్తిస్తున్నా. బార్డర్‌లో విధులు నిర్వహించడం సంతోషంగా ఉంది. ఆర్మీలో పనిచేసేందుకు యువత ముందుకు రావాలి.

– నూకల మహేశ్, బీతాశవాడ, చెన్నూర్

జైజవాన్.. జైకిసాన్..

బోథ్ పట్టణానికి చెందిన రాసం ప్రవీణ్‌కుమార్, మల్లెపూల మహేందర్ సైనికులుగా దేశసేవలో విధులు నిర్వర్తించారు. ఉద్యోగ విరమణ అనంతరం వ్యవసాయం చేస్తున్నారు. జైజవాన్, జైకిసాన్ నినాదానికి అనుగుణంగా రైతులుగా మారి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

దేశం తరఫున ప్రపంచానికి సేవలు



బర్నాలీ హరిప్రిదా

చింతలమానెపల్లి: కుమురంభీం జిల్లా చింతలమానెపల్లి మండలంలోని రవీంద్రనగర్‌కు చెందిన బర్నాలీ హరిప్రిదా సైనికురాలిగా భారత ఆర్మీలో విధులు నిర్వహిస్తూ ఐక్యరాజ్యసమితి సైన్యానికి ఎంపికైంది. ఐరాస తరఫున ఆఫ్రికా ఖండంలోని కాంగో దేశంలో విధులు నిర్వహిస్తూ దేశానికి గర్వకారణంగా నిలుస్తోంది. బర్నాలీ అస్సాంలోని తేజ్‌పూర్‌లో జన్మించి అస్సాం గుర్ఖా రైఫిల్స్‌లో రైఫిల్ వుమెన్‌గా ఎంపికైంది. ఇదే సైన్యంలో పనిచేస్తున్న రవీంద్రనగర్‌కు చెందిన హరిప్రిదను వివాహం చేసుకుంది. గ్రూప్ కమాండర్‌గా స్థానికులకు సేవలందించడం, అసిస్టెంట్ కమాండ్ అధికారిగా సైనికుల విధులను పర్యవేక్షించడం ఈమె విధులు. దేశం తరఫున ఐక్యరాజ్యసమితి సైన్యంలో పనిచేయడం తనకు గర్వకారణంగా ఉందని ఈసందర్భంగా ఆమె పేర్కొంది.

గర్వంగా ఉంది



బోథ్: పాకిస్తాన్ బార్డర్‌లో విధులు నిర్వర్తిస్తున్నా. దేశ రక్షణలో పాలుపంచుకోవడం సంతోషంగా ఉంది. భారత ప్రజల దీవెనలే మాకు బలం. జవాన్‌గా పనిచేయడం గర్వంగా ఉంది. దేశసేవ చేసేందుకు యువత ముందుకు రావాలి.

– నీలి రాము, సైనికుడు, బోథ్

సంతృప్తిగా ఉంది



దేశానికి సేవ చేయడంలో సంతృప్తిగా ఉంది. దేశ రక్షణ కంటే మనకు ఏదీ ముఖ్యం కాదు. నెలల తరబడి ఇంటికి రాకున్నా కుటుంబ సభ్యులతో కలిసి ఉన్నట్లుగానే ఉంటోంది. ప్రస్తుతం కశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్నా.

– శ్రీరాం, నర్సాపూర్, ఇచ్చోడ

సేవే లక్ష్యంగా..



దేశానికి సేవ చేయడంలో ఉన్న సంతృప్తి మరెందులోనూ లేదు. చిన్ననాటి నుంచి దేశంకోసం పనిచేయాలన్న ఆలోచన ఉండేది. అదే పట్టుదలతో ఐదేళ్ల క్రితం ఆర్మీలో చేరా. ప్రస్తుతం చైనా బార్డర్‌లో లద్దాక్‌లో పనిచేస్తున్నా.

– సతీష్‌కుమార్, మర్లపెల్లి, బోథ్

అదృష్టంగా భావిస్తున్నా



పన్నెండేళ్లుగా ఆర్మీలో పనిచేస్తున్నా. ప్రస్తుతం కశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్నా. ఎముకలు కొరికే చలిని సైతం తట్టుకుని పనిచేస్తున్నాం. దేశ రక్షణలో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నా.

– అనిల్, నర్సాపూర్, ఇచ్చోడ

బీజేపీ జిల్లా అధ్యక్ష పదవి ఎస్సీలకు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

బెల్లంపల్లి: బీజేపీ జిల్లా అధ్యక్ష పదవి ఎస్సీలకు కేటాయించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి డిమాండ్ చేశారు. శనివారం బెల్లంపల్లిలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 3లక్షల వరకు దళిత ఓటర్లు ఉన్నారని అన్నారు. బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాలను ఎస్సీలకు రిజర్వు చేశారని గుర్తు చేశారు. అదీ కాక పెద్దపల్లి పార్లమెంట్ కూడా ఎస్సీలకే కట్టబెట్టారని వివరించారు. జిల్లా అధ్యక్ష పదవిని ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించడం సబబుగా ఉంటుందని పేర్కొన్నారు.సమావేశంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివాజీ, జిల్లా అధ్యక్షుడు కోడి రమేష్, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, కార్యదర్శి నవీన్, సురేష్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేశవరెడ్డి, జిల్లాఅధికార ప్రతినిధి శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పక్షుల సర్వే



పక్షులను గుర్తిస్తున్న నిపుణులు

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో పక్షుల సర్వే కొనసాగుతోంది. డివిజన్‌లోని ఇందన్‌పల్లి, జన్నారం, తాళ్లపేట్ అటవీ రేంజ్‌లలో పక్షుల నిపుణులు, అటవీ అధికారులు వలంటీర్లు పక్షుల సర్వే చేస్తున్నారు. ఉదయం 6నుంచి 10గంటల వరకు, మధ్యాహ్నం 3నుంచి 6గంటల వరకు పక్షులను గుర్తిస్తున్నారు. జన్నారం, ఇందన్‌పల్లి రేంజ్ అధికారులు సుష్మారావు, కారం శ్రీనివాస్ సర్వేను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఏడు టీంలు, 28 మంది ఎక్కడికక్కడే సర్వే నిర్వహించారు. ఆదివారంతో డివిజన్‌లో సర్వే పూర్తవుతుందని అధికారులు తెలిపారు.

రైల్వే క్రికెట్ ట్రోఫీ విజేత బెల్లంపల్లి లోకోస్టార్

- రన్నరప్ కాజీపేట ఆర్‌పీఎఫ్ జట్టు
- ట్రోఫీని అందజేసిన ఏడీఆర్ఎం గోపాల్



ట్రోఫీ అందజేస్తున్న రైల్వే ఏడీఆర్ఎం గోపాల్

కాజీపేటరూరల్: రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్ కమిటీ ఆధ్వర్యంలో కాజీపేట రైల్వే స్టేడియంలో 12 రోజులపాటు జరిగిన 76వ రిపబ్లిక్ డే సెలబ్రేషన్స్ క్రికెట్ లీగ్ సికింద్రాబాద్ డివిజనల్ లెవెల్ టోర్నమెంట్‌లో బెల్లంపల్లి లోకోస్టార్ విజయం సాధించింది. కాజీపేట ఆర్‌పీఎఫ్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. బెల్లంపల్లి జట్టు 20 ఓవర్లకు 195 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన కాజీపేట ఆర్‌పీఎఫ్ జట్టు 20 ఓవర్లకు 180 పరుగులు చేసింది. విజేతలకు సికింద్రాబాద్ డివిజన్ అడిషనల్ రైల్వే మేనేజర్(ఏడీఆర్ఎం) ఎం.గోపాల్ బహుమతులు అందజేశారు. అంతకుముందు సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ జోనల్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్ ప్రత్యేక అతిథిగా హాజరై బెల్లంపల్లి లోకోస్టార్ –కాజీపేట ఆర్‌పీఎఫ్ జట్ల మధ్య టాస్‌వేసి పోటీని ప్రారంభించారు. ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రైల్వే ఇనిస్టిట్యూట్ చైర్మన్ ఆర్.ప్రశాంత్‌కృష్ణసాయి, వైస్ చైర్మన్ ఎస్.వి.వెంకటకుమార్, రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ రవీందర్, జెడ్‌బ్ల్యూసీ మెంబర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రాణాలకు హెల్మెట్ రక్షణ

- రామగుండం సీపీ శ్రీనివాస్



హెల్మెట్ అందజేస్తున్న సీపీ శ్రీనివాస్

మంచిర్యాలక్రైం: ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారి నుంచి కాపాడుకునేందుకు హెల్మెట్ ప్రాణాలకు రక్షణ కల్పిస్తుందని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం మంచిర్యాలలో హెల్మెట్ ర్యాలీ, ఐబీ చౌరస్తాలో ట్రాఫిక్ నిబంధనలు, ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు 150 మందికి ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. హెల్మెట్ల దాత ట్రస్మా జిల్లా అధ్యక్షుడు ఎండీ అజీజ్, ట్రస్మా మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, ట్రస్మా జిల్లా ఉపాధ్యక్షుడు ఉస్మాన్ పాషా, ట్రస్మా మందమర్రి జనరల్ సెక్రెటరీ లతశ్రీ, మంచిర్యాల కళాశాలల అధ్యక్షుడు రమణలను సీపీ శ్రీనివాస్ శాలువాలతో సత్కరించారు. మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్, ట్రాఫిక్ ఏసీపీ జాడి నర్సింహులు, ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ, పట్టణ సీఐ ప్రమోద్‌రావు, రూరల్ సీఐ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి

మంచిర్యాలక్రైం: నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సీపీ ఎం.శ్రీనివాస్ అన్నారు. కమిషనరేట్ ఆవరణంలోని సమావేశ మందిరంలో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ ప్రతీ కేసులో సాంకేతిక పరమైన పూర్తి స్థాయి ఆధారాలతో సమగ్ర విచారణ జరపాలని, నేరస్తులకు శిక్ష పడే విధంగా పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు భాస్కర్, చేతన, రాజు, ఏసీపీలు ప్రకాశ్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

తండ్రిని చంపిన కేసులో ఇద్దరు మైనర్లు, యువకుడు అరెస్టు

- తల్లి సంతోషంగా ఉండాలని హత్యచేసిన కుమారుడు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ వెంకటేశ్వర్లు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

జైపూర్(చెన్నూర్): తల్లి సంతోషంగా ఉండాలని తండ్రిని చంపిన తనయుడితో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం అసిస్టెంట్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఇందారంకు చెందిన ఆవిడపు రాజయ్య (45) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతనికి భార్య భాగ్యలక్ష్మి, కుమారుడు ఉన్నారు. రాజయ్య మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. పదిరోజుల క్రితం ఇదే విషయంపై గొడవ జరగడంతో భార్యను కొట్టడంతో కుమారుడిని తీసుకుని పుట్టింటికి వెళ్లింది. దీంతో ఎప్పటికైనా తన తండ్రితో తనకూ, తన తల్లికి ప్రాణహాని ఉందని, అతన్ని చంపేస్తే సంతోషంగా ఉండవచ్చని భావించాడు. తన స్నేహితులైన శ్రీరాంపూర్‌లోని అరుణక్కనగర్‌లో నివాసం ఉండే జంపల్లి సందీప్, నర్వలో నివాసం ఉండే మరో బాలుడితో కలిసి ఈనెల 24న రాత్రి రాజయ్య ఉండే ఇంటికి వచ్చారు. తలుపు కొట్టడంతో రాజయ్య నిద్రనుంచి లేచి తలుపు తీయగా వెంటనే గట్టిగా తోయడంతో మంచంపై పడిపోయాడు. వెంటనే అతని కుమారుడు చాతిపై కూర్చోగా వెంట వచ్చినవారు కాళ్లు, చేతులు పట్టుకున్నారు. వెంట తెచ్చుకున్న కత్తితో కుమారుడు తండ్రి గొంతు కోశాడు. వెంటనే ఆటోలో ముగ్గురు కలిసి పారిపోయారు. హత్యకు వాడిన ఆటో, కత్తి, రెండు సెల్‌ఫోన్లు, బైక్‌లను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో శ్రీరాంపూర్ ఇన్‌చార్జి సీఐ రవీందర్, స్థానిక ఎస్సై శ్రీధర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు పెంకుటిల్లు దగ్ధం

జన్నారం: ప్రమాదవశాత్తు పెంకుటిల్లు దగ్ధమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం జన్నారం మండలం బాదంపెల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బిస్వేటగూడెంలో జాడి సురేష్ ఇంట్లో శనివారం దేవుడి ఫొటోల ముందు దీపం వెలిగించారు. కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లగా ఇంట్లో మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు ఫైరింజన్‌కు సమాచారం ఇవ్వడంతో మంటలు ఆర్పివేశారు. దీపం కింద పడడంతోనే ప్రమాదం సంభవించినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనలో రూ.1.80 లక్షల నగదుతో పాటు సామగ్రి దగ్ధమయ్యాయి. రూ.6లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు. తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఆర్ఐ భానుచందర్ వివరాలు సేకరించారు.

ఎస్టీపీపీ ఉత్తమ ఉద్యోగులు వీరే...

జైపూర్: 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్టీపీపీ నుంచి నలుగురు ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేశారు. కె.అరుణ్(ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పర్చేస్), అజ్మీర మోహన్ ఉత్తమ సింగరేణియన్‌గా కొత్తగూడెంలో జరిగే వేడుకల్లో సింగరేణి సీఎండీ బలరాం చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. సీనియర్ స్టాఫ్ నర్స్ రాజమణి, కె.వెంకటస్వామి, జూనియర్ అసిస్టెంట్ ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికయ్యారు. వీరు ఎస్టీపీపీలో నిర్వహించే వేడుకల్లో అవార్డులు అందుకుంటారు.

ఓటు ఎంతో విలువైంది

మంచిర్యాలఅగ్రికల్చర్: ఓటు ఎంతో విలువైందని కలెక్టర్ కుమార్‌దీపక్ పేర్కొన్నారు. శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన వేడుకల్లో అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి పాల్గొన్నారు. వీడియో ద్వారా భారత ఎన్నికల సంఘం కమిషనర్ రాజీవ్ కుమార్ సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం అధికారులు, విద్యార్థులు, సిబ్బందితో కలిసి ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. నూతనంగా ఓటు నమోదు చేసుకున్న వారికి ఎపిక్ కార్డులు పంపిణీ చేశారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మనస్తాపంతో ఒకరు ఆత్మహత్య

గుడిహత్నూర్(బోథ్): మనస్తాపంతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన షేక్ హఫీజ్ (40) డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం ఇంట్లో భార్య ఫౌజియా బేగంతో గొడవ జరగడంతో ఆమె తన ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురయ్యాడు. రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం అతని తల్లి నజీమా తలుపు తట్టినా లేవకపోవడంతో మరో కుమారుడు షేక్ ఫిరోజ్‌కు సమాచారం అందించగా అతను వచ్చి తలుపు గొళ్లెం తెరిచి చూడగా ఉరేసుకుని కనిపించాడు. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై వివరాలు సేకరించారు.